క్లుప్తంగా

నెమలి పింఛాల అలంకరణలో రాసపోలమాంబ అమ్మవారు



తగరపువలస: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమాంబను మంగళవారం ఆలయ కమిటీ ప్రతినిధులు నెమలి పింఛాలతో అలంకరించారు. ఈ ప్రత్యేక అలంకరణతో అమ్మవారి దర్శనాలు భక్తులకు కల్పించారు. ప్రసాదాల పంపిణీ, అమ్మవారి అలంకరణకు గ్రామానికి చెందిన గంటా బంగారయ్య, లక్ష్మి రమణమ్మ దంపతులు సహాయ సహకారాలు అందించారు.

ఘనంగా బంగారమ్మ ఉత్సవాలు



విద్యుత్ దీపాలంకరణతో ఆలయం

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురంలో సుంకర వారి ఇలవేల్పు బంగారమ్మ ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా అమ్మవారి ప్రతిమలను గ్రామంలో ఊరేగించారు. మంగళవారం రాత్రి రథాల ఉత్సవం నిర్వహించారు. ఎడ్ల బళ్లను రథాలుగా తీర్చిదిద్ది ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బుధవారం ముగింపు ఉత్సవం నిర్వహించనున్నారు. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



పూజలందుకున్న ఉత్సవ మూర్తులు

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీవారి ఉత్సవ మూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. అనంతరం టీటీడీ అర్చకులు, వేద పండితులు అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

ప్రపంచశాంతి స్థాపనకు కృషి



ప్రపంచ శాంతి కోసం ప్రతిజ్ఞ చేస్తున్న ఆదర్శహిందీ ప్రేమీ మండలి విద్యార్థులు

తగరపువలస: ఐక్యరాజ్యసమితి 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి విద్యార్థులు ప్రపంచ శాంతి కోసం ప్రతిజ్ఞ చేశారు. మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఐక్యరాజ్య సమితిలో 192 సభ్య దేశాలకుగాను 15 దేశాలకు భద్రతా మండలిలో సభ్యత్వం ఉంటే కేవలం 5 అగ్రరాజ్యాలకే వీటో అధికారం ఉందన్నారు. ఐక్యరాజ్యసమితికి సొంతంగా సైన్యం లేకపోవడం వల్ల వీటో అధికారం కలిగిన అగ్రరాజ్యాలు తరచూ యుద్ధంలో పైచేయి సాధిస్తున్నాయని వివరించారు.

సంబరాల దసరా

వైభవంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు

తగరపువలస: శ్రీదేవీ శరన్నవరాత్రి యాగ మహోత్సవాలు మంగళవారం నాటి విజయదశమి వేడుకలతో ముగిశాయి. సంగివలస పోలమాంబ అమ్మవారి ఆలయంలో దేవదాయ శాఖ వారిచే నిర్వహించిన చండీ హోమం సోమవారం సాయంత్రం పూర్ణాహుతితో ముగిసింది. ఈ వేడుకల్లో ఆలయ ఈవో ప్రసాద్, నీలయమ్మ సత్రం భూముల ఈవో నానాజీబాబు, అర్చకులు పెదపూడి శ్రీనివాసశర్మ, నరసింహాశర్మ ఏడిద రామకృష్ణశర్మ, ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, తాటికొండ రాంబాబు పాల్గొని అమ్మవారి ఆశీర్వచనాలు స్వీకరించారు. ఆలయంలో మంగళవారం దుర్గా హోమం, పారాయణ నిర్వహించారు. అమ్మవారిని సోమవారం మహిషాసురమర్ధినిగా, మంగళవారం రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి రోడ్డు ఆంధ్రా బ్యాంకు రహదారిలోని మండపంలో అర్చకుడు సోమయాజుల కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో శమీపూజ, పూర్ణాహుతి, కలశ, విగ్రహ ఉద్వాసన, అమ్మవార్లకు సారె సమర్పణ చేపట్టారు. సంతపేట కొత్తమ్మవారిని రాజరాజేశ్వరిదేవిగా, చిట్టివలస రెడ్డి వీధిలో అమ్మవారిని మహిషాసురమర్ధినిగా అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. భీమిలి మండలం శింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేట రామాలయంలో గ్రామ వికాస సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన రాజరాజేశ్వరి హోమంలో భీమిలి జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, సర్పంచ్ గాడు వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భీమునిపట్నం: విజయ దశమి సందర్భంగా మంగళవారం పలు ప్రాంతాల్లో దుర్గ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. చిన్నబజారు మేదర వీధి సమీపంలోని శ్రీకనక దుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారిని వెండి జరీ చీరతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. స్థానిక మరిడమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయాలకు రావడంతో సందడి నెలకొంది.



శిల్పారామంలో నృత్యం చేస్తున్న కళాకారులు

పద్మనాభం: దసరా సంబరాల్లో భాగంగా పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయం వద్ద జమ్మి ఉత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముందుగా కుంతీ మాధవ స్వామి ఆలయంలోని శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలను గాలి గోపురం వద్దకు తోడ్కొని వచ్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. అనంతరం స్వామి జమ్మి వేటకు వెళ్లారు. తదుపరి గాలి గోపురం ఆవరణలో నాటిన జమ్మి చెట్టుకు ఉన్న అస్త్రాలను అర్చక స్వాములు, భక్తులు బాణాలతో కొట్టారు. ఆలయ ప్రధాన అర్చకుడు పి.సీతారామాంజనేయస్వామి సహకారంతో అర్చక స్వాములు పవన్, వెంకటరామాచార్యులు ఉత్సవం నిర్వహించారు.

తగరపువలస: భీమిలి రోడ్డులోని మండపంలో మంగళవారం సాయంత్రం అమ్మవారికి కదంబవనంలో రాజరాజేశ్వరీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు చేశారు. కదంబచెట్టు ఆకులు, పువ్వులతో అమ్మవారిని అర్చకుడు కల్యాణచక్రవర్తి శర్మ అలంకరించారు.

రాజరాజేశ్వరి దేవి అలంకరణలో బబ్బేలమ్మ

పీఎం పాలెం : గత 9 రోజులుగా బబ్బేలమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. విజయ దశమిని పురస్కరించుకుని అమ్మవారు సోమ, మంగళవారాల్లో రాజరాజేశ్వరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా కుంకుమ పూజలో ఉపయోగించిన కుంకుమను మహిళలకు ఉత్సవ నిర్వాహకులు పంపిణీ చేశారు. ఆలయ ఆవరణలో అనేక మంది వాహన పూజలు నిర్వహించారు.

పీఎం పాలెం : శిల్పారామంలో కొద్ది రోజులుగా జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాలు మంగళవారం సాయంత్రంతో ముగిశాయి. ఈ సందర్భంగా సోమవారం సింహాచలం సరస్వతీ నృత్య కళామందిరం ఆధ్వర్యంలో నిర్వహించగా మంగళవారం కిరణ్మయి నృత్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి. కళాకారులు చంద్రిక, తనుశ్రీ,, మాధవి, వినూత్న, జశ్విత, పూజిత, ముక్తిక, చరిష్మా, లక్ష్మీ ప్రసన్న, దీక్షిత, హాసిని, సుమన్విత తదితర 40 మంది కళాకారులు పాల్గొనగా కిరణ్మయి నృత్య దర్శకత్వం వహించారు. స్థానిక పరిపాలన అధికారి టి.విశ్వనాథ రెడ్డి పర్యవేక్షించారు.



ఇస్కాన్‌లో రావణ దిష్టిబొమ్మ దహనం కార్యక్రమంలో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక నృత్యాలు

మధురవాడ: విజయ దశమిని పురస్కరించుకుని మధురవాడలోని వివిధ ఆలయాల్లో అమ్మవారిని భక్తులు విశేషంగా దర్శించుకున్నారు. మధురవాడ టైలర్స్ కాలనీ, సిద్ధేశ్వర పీఠం, గణేష్‌నగర్ విజయ గణపతి ఆలయం, మానం ఆంజనేయులు నగర్‌లోని శ్రీ లలితా త్రిపుర సుందరి సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు మహిషాసుర మర్ధినిగా దర్శనమిచ్చారు. మండపాల్లో నిర్వాహకులు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. రేవళ్లపాలెం శ్రీ సూర్య రెసిడెన్సీ బహుళ అంతస్తుల భవనం వద్ద మోక్ష ప్రణీత తదితరులు ప్రదర్శించిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయంలో అమ్మవారిని వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ దర్శించుకుని పూజలు చేశారు.



జమ్మి వృక్షం వద్ద అర్చకులు, భక్తులు



సంగివలస పోలమాంబ ఆలయంలో పూర్ణాహుతిలో ఈవోలు ప్రసాద్, నానాజీబాబు



కృష్ణంరాజుపేటలో పూజలో భక్తులు



ఆంధ్రాబ్యాంకు వద్ద మండపంలో సారె



రేవళ్లపాలెంలో ఆకట్టుకున్న నృత్యం



టైలర్స్ కాలనీలో అమ్మవారు











మహిషాసురమర్ధినిగా.. రాజరాజేశ్వరిదేవి అలంకరణలో.. వెండి జరీచీర అలంకరణలో.. రాజరాజేశ్వరిదేవిగా.. రాజరాజేశ్వరీ దేవి అలంకరణలో అమ్మవారు

జమ్మి ఉత్సవం.. పరవశించిన భక్త జనం

- సింహగిరికి పోటెత్తిన భక్తులు
- విద్యుత్ కాంతుల్లో కొలను

సింహాచలం: సింహగిరి భక్తులతో పులకించింది. అంతటా ఆధ్యాత్మికత ఉట్టిపడింది. మంగళవారం విజయదశమి పర్వదినాన స్వామిని దర్శించుకోవడానికి భక్తులు పోటెత్తారు. శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి జరిగిన జమ్మివేట ఉత్సవంలో భక్తులు తరించా రు. రామాలంకారంలో స్వామిని కనులారా వీక్షించి పరవశించారు. విద్యుత్ కాంతులతో కొండదిగువ పూలతోట నూతన శోభ సంతరించుకుంది. ఉత్సవా న్ని తిలకించేందుకు పూలతోటకు వేలాది మంది భక్తులు క్యూ కట్టారు. సాయంత్రం 5గంటల సమయంలో సింహగిరి నుంచి కొండదిగువకు మెట్లమార్గంలో స్వామివారిని తీసుకొచ్చారు. అక్కడ దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, అధికారులు, అడవివ రం గ్రామస్తు లు ఘన స్వాగతం పలికారు. అక్కని నుంచి స్వామిని పూలతోటలోకి తీసుకెళ్లారు. పూల తోటలోని మండ పంలో జమ్మివేట ఉత్సవం విశేషంగా జరిగింది. అలాగే అడవివరం పురవీధిల్లో అశ్వావాహనంపై స్వామి తిరువీధి ఘనంగా జరిగింది. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సంపంగి శ్రీనివాసరావు, వారణాసి దినేష్‌రాజ్, దొడ్డి రమణ, సువ్వాడ శ్రీదేవి తదితరులు ఉత్సవంలో పాల్గొన్నారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రధాన రహదారులపై ట్రాఫిక్ కష్టాలు



తగరపువలస మెయిన్ రోడ్డు మధ్యలో ఆటోలు నిలిపివేయడంతో నిలిచిన సిటీ బస్సు



సంతపేట గొల్లవీధిలో ప్రధాన రహదారికి అడ్డంగా ఆటోలు, ద్విచక్రవాహనాలు



తాతా థియేటర్ - ఆంధ్రాబ్యాంకు రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

వాహనదారులకు తప్పని అవస్థలు

తగరపువలస: స్థానిక పట్టణ ప్రాంతంలో ప్రధాన రహదారులు ఎటు చూసినా వాహనాల రాకపోకలకు వీలు లేకుండా పోతున్నాయి. అసలే ఇరుకైన రహదారులపై ఆటోవాలాలు, ద్విచక్ర వాహనదారులు ఇష్టారాజ్యంగా తమ వాహనాలు నిలిపి ఉంచేయడంతో మిగిలినవారు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే బంగ్లామెట్ట నుంచి చిట్టివలస ఈఎస్ఐ ఆస్పత్రి వరకు సగం ప్రధాన రహదారి వ్యాపారుల చేతిలో చిక్కిశల్యమైపోయినా జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు చోద్యం చూస్తున్నారు. దీనికితోడు ఆటో కార్మికులు కూడా రోడ్డు పక్కన కాకుండా మధ్యలో నిలిపి ప్రయాణికులు ఎక్కేవరకు ఉంచుతున్నారు. ఒక్కోసారి రోడ్డు మధ్యలో ఆటోలను నిలిపి ప్రైవేట్ మార్కెట్‌లో పనులు చూసుకుని వచ్చేవరకు మిగిలిన వాహనదారులు వేచి చూడాల్సి వస్తోంది. తగరపువలస మొత్తం మీద వాహనాల పార్కింగ్‌కు ఎలాంటి వసతులు లేకపోవడంతో మిగిలిన వాహనదారులు ఎక్కడికక్కడే తమ వాహనాలను నిలిపివేస్తున్నారు. దీంతో గాంధీబొమ్మ వీధి, పాత లోకల్ ఆఫీసు వీధి, మణికంఠ స్వీట్స్ అండ్ బేకరీ వెనుక శ్రీనగర్ వీధి, సంతబయలు రహదారి, చిల్డ్రన్స్ కాన్వెంట్ మార్గం, భీమిలి రోడ్డు, కరణం బడి వీధి, పద్మశాలి భవన్ మార్గం, తగరపువలస - ఆంధ్రాబ్యాంకు రహదారి నిత్యం వాహనాల నిలిపివేతతో వాహనదారులతో పాటు స్థానికంగా నివసిస్తున్న వారు పద్మవ్యూహంలో చిక్కుకుపోతున్నారు.

ఫంక్షన్ల పేరుతో రహదారుల మూసివేత

ఇళ్లల్లో జరిగే ఫంక్షన్లు, అన్నసంతర్పణల సమయంలో నిర్వాహకులు ఇష్టారాజ్యంగా రహదారులను మూసివేస్తున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా రహదారుల మధ్యలో మార్గాలను అనధికారంగా మూసి వేయడంతో లోపలికి వచ్చే వాహనాలు తిరిగి వెనక్కు మళ్లించలేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజుల తరబడి రహదారులపై టెంట్లు వేయడం, కాంక్రీట్ మిల్లర్లు, భవన నిర్మాణ మెటీరియల్ ఉంచడం చేస్తున్నారు. గంటల తరబడి ఊరేగింపులు, బ్యాండు మేళాలు, డీజేలతో మోత మోగించి రహదారులకు ఇరువైపులా నివసిస్తున్న వారి చెవులు చిల్లులు పడేలా రోత పుట్టిస్తున్నారు.

పైన పేర్కొన్న మార్గాల్లోనే కాకుండా జాతీయ రహదారి వెంట సర్వీస్‌రోడ్లను హోటళ్లు, మెకానికల్ వర్కర్లు ఆక్రమించి వాహనాల ట్రాఫిక్‌కు ప్రతిబంధకంగా తయారవుతున్నారు. నిత్యం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 8 వరకు తగరపువలస చుట్టూ రహదారులు అష్టదిగ్బంధనంలో ఉండిపోతున్నాయి. ఇప్పటికిప్పుడు రహదారులు విస్తరించకపోయినా ఉన్న రహదారులను క్లియర్‌గా ఉంచడం వల్ల వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలని భీమిలి జోన్ ప్రజలు కోరుతున్నారు.

జాతీయ తైక్వాండో పోటీల్లో ప్రతిభ

మధురవాడ: తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 21, 22న నిర్వహించిన తైక్వాండో పోటీల్లో మధురవాడకు చెందిన నలుగురు క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఆంధ్రప్రదేశ్ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ ఇంటర్ స్టేట్ ఇన్విటేషన్ తైక్వాండో చాంపియన్ షిప్ - 2023 పోటీలు జరిగాయి. ఇందులో మధురవాడకు చెందిన ఆనంద్ తైక్వాండో అండ్ మార్షల్ ఆర్ట్స్ క్లబ్‌కు చెందిన ఎస్.నిఖిల్ (41 కేజీలు), పి.వెంకటేష్ (57 కేజీలు) బంగారు పతకాలు, ఎ.పవిత్ర (47 కేజీలు), పి.భార్గవి (51 కేజీలు) రజిత పతకాలు సాధించారు. విజేతలను ఏఎస్పీలు జె.కులశేఖర్, జె.వెంకటరావు, ఏపీ అమెచ్యూర్ తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి, గ్రాండ్ మాస్టర్ కె.బాబూరావు, అధ్యక్షులు వి.విజయ్‌కుమార్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ ఆనంద్ పాల్గొన్నారు.



అతిథులతో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

విస్తృతంగా అన్నసంతర్పణలు



నగరంపాలెంలో అన్నసంతర్పణ ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

మధురవాడ: శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపులో భాగంగా సోమవారం జీవీఎంసీ 6, 7 వార్డుల్లో భారీగా అన్నసంతర్పణ చేశారు. నగరంపాలెంలో వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ అన్నదానం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు వాండ్రాసి రవికుమార్, లింగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



చంద్రంపాలెం దుర్గాలమ్మ ఆలయం వద్ద అన్నప్రసాదం పంపిణీ చేస్తున్న రమణమూర్తి

- జీవీఎంసీ 6వ వార్డు చంద్రంపాలెం జాతర గట్టు పూర్వ గుడి దుర్గాలమ్మ ఆలయంలో వ్యవస్థాపక ధర్మకర్త పిళ్లా పాపారావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భారీ అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. కళా హాస్పిటల్ ఎండీ డాక్టర్ పీవీ రమణమూర్తి అన్నం వడ్డించి ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

కమనీయం.. కల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేసి ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఉప ప్రధానార్చకుడు కె.కె.ప్రసాదాచార్యులు, అర్చకులు శ్రీకాంత్ తదితరులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.



అప్పన్న ఉత్సవమూర్తులు

హైస్కూల్ క్రికెట్ లీగ్ విన్నర్ టైటాన్స్

తగరపువలస: విజయదశమి సందర్భంగా చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహించిన హైస్కూల్ క్రికెట్ లీగ్‌లో విన్నర్స్‌గా టైటాన్ జట్టు, రన్నర్స్‌గా రెడ్ బుల్స్ జట్టు నిలిచాయి. వీరు వరుసగా రూ.3వేలు, రూ.2వేలు నగదు బహుమతుల తోపాటు ట్రోఫీలు, వ్యక్తిగత పతకాలు సొంతం చేసుకున్నారు. వీరికి హైస్కూల్ ఆవరణలో విశ్రాంత డీపీవో పిట్టా త్రినాథ్, ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహన్‌రావు, వెంపాడ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు వెంపాడ శ్రీనివాస రెడ్డి చేతుల మీదుగా మంగళవారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు అక్కరమాని లోవరాజు మాట్లాడుతూ ఏటా దసరా, సంక్రాంతి సందర్భంగా రెండు సార్లు పూర్వ విద్యార్థుల సాయంతో క్రికెట్ లీగ్ నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్, బెస్ట్ బౌలర్, బ్యాట్స్‌మెన్, ఆల్‌రౌండర్ ట్రోఫీలు అందించారు. కార్యక్రమంలో ప్రతాప్, శాంతా, కిషోర్, హరి, రాజీ, ధర్మతేజ, సోమశేఖర్, చోను తదితరులు పాల్గొన్నారు.



విన్నర్స్, రన్నర్స్ జట్లతో నిర్వాహకులు

అర్చకునికి ఘన సన్మానం

మధురవాడ: ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రచయిత, సామాజిక వేత్త బ్రహ్మశ్రీ భాస్కరబట్ల సత్యప్రసాద్‌శర్మను రేవళ్లపాలెంలో పలువురు ఘనంగా సత్కరించారు. ఇక్కడ ఆయన ఆధ్యాత్మిక ప్రవచనం అందరి మన్ననలు పొందింది. ఉత్సవ కమిటీ సభ్యులతో పాటు శ్రీమారుతి విప్ర సేవా సమితి అధ్యక్షులు గుర్నాథం శర్మ, మధురవాడ శ్రీ ఆరామ ద్రావిడ సంఘం ప్రతినిధులు వేమకోటి సుబ్బలక్ష్మి శర్మ పాల్గొన్నారు.



రేవళ్లపాలెంలో సత్యప్రసాద్‌శర్మను సత్కరిస్తున్న స్థానికులు